# సింగిల్ పేజీ కథలు

బేంకుకి టైమయిపోతోంది. హడావిడిగా స్కూటరు స్టార్ట్ చెయ్యబోతున్నాను. ఒక నల్లటతను చంకలో సంచి పెట్టుకుని వస్తూ నమస్కరించాడు. చిరాకేసినా తమాయించుకుని ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూసాను. అతడు సంచిలోంచి అందమైన డిజైన్లున్న లేసు గుడ్డలు బైటికి తీసి "సార్, మీకు తక్కువ ధరకిచ్చేస్తాను. తీసుకోండి" అన్నాడు.

"మా బేంకులోనే బోల్డుమంది లేసు వర్తకులు ఖాతాదార్లుగా వున్నారు. నాక్కావాలంటే ఊరికినే ఇస్తారు. అయినా నాకు ఇంట్రస్టు లేదు" అన్నాను.

"అలా అనకండి సార్. నాకోపూట భోజనం పెట్టిన వారవుతారు. ఇవి తీసుకుని మీకు తోచినంత ఇవ్వండి" అన్నాడు దీనంగా.

నాకు కలుక్కుమంది. ఎవరైనా తిండి దొరక్క పస్తులుంటున్నారంటే నేను సహించలేను. నా గత చరిత్ర నాకు నేర్పిన పాఠమది. వారాలు చేసుకుంటూ డిగ్రీ చేసి, ఆ శ్రీమన్నారాయణుడికి కటాక్షం వల్ల బేంకులో ఆఫీసరుగా మంచి ఉద్యోగం సంపాదించుకోగలిగాను. అతడికేసి జాలిగా చూసి జేబులో చెయ్యి పెట్టాను. ఒక నోటు చేతికి తగిలింది. అది ఎంత అని చూడకుండా అతడి చేతిలో కుక్కి వెళ్ళిపోబోయాను.

అతడు అభిమానంగా "సార్ నాకు దానమొద్దు. ఈ లేసుగుడ్డలు తీసుకోండి" అన్నాడు.

"చూడు నాయనా, నీతో మాట్లాడే టైము లేదు నాకు. ఇంకోసారి కొంటాలే" అని నోటు తిరిగి తీసుకోకుండా స్కూటరు స్టార్ట్ చేసుకుని సాగిపోయాను.

ఇది జరిగి ఎన్ని రోజులైందో నాకు గుర్తులేదు. అసలా సంఘటననే నేను మర్చిపోయాను.

ఇంకోరోజు సాయంత్రం అతడు మా యింటికొచ్చాడు. "సార్ మీరు చాలా మంచివారు. అందుకని మీకు అసలు ధరకే లేసుగుడ్డలిచ్చేస్తాను. ఈ నమూనాలు చూడండి" అని సంచిలోంచి బైటికి తీసాడు. నాకు వద్దన్నా వినిపించుకోకుండా "సార్ నాకింత అన్నం పెట్టిన వారవుతారు. తీసుకోండి సార్" అన్నాడు.

నేను కాదనలేక చుట్టూ లేస్ డిజైన్ వున్న రుమాలు చూపించి అల్లాంటివి రెండు డజన్లు తీసుకు రమ్మన్నాను. ఒక్కోటి బజార్లో పది రూపాయలకి అమ్ముతారని, నాకు ఆరు రూపాయలకే ఇస్తానని అన్నాడు. సరే అన్నాను. గుడ్డ కొనడానికి అడ్వాన్సుగా ఒక్క వంద రూపాయలిమ్మన్నాడు. వెంటనే ఇచ్చేసాను. వారం రోజుల్లో తీసుకు వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. ఆర్నెల్లు గడిచింది. అతడు సత్తాలేడు. నేను చాలా బాధపడ్డాను.

ఆర్నెలల తర్వాత అనుకోకుండా అతడు రోడ్డు మీద కనిపించాడు. కోపంగా వెళ్ళి చొక్కా పట్టుకుని నాలుగు తిట్లు తిట్టాను.


అతడు బిక్కమొహం వేసి "సార్, మా అమ్మ చచ్చిపోయింది. అందుకని అనుకున్న సమయానికి ఇవ్వలేకపోయాను. నాలుగు రోజుల్లో తెచ్చి ఇస్తాను" అన్నాడు.

నా తొందరపాటుకి పశ్చాత్తాపపడుతూ అతడిని వదిలేసాను.

మరో ఆర్నెల్లు గడిచాయి. అతడు రాలేదు. కానీ మళ్ళీ అనుకోకుండా దారిలో తటస్థపడితే మళ్ళీ చొక్కా పట్టుకున్నాను.

అతడు వెక్కి వెక్కి ఏడుస్తూ, "నా ఖర్మసార్. క్షమించండి. మా నాన్న చచ్చిపోయాడు. నాలుగే నాలుగురోజుల్లో మీకు రుమాళ్ళు తెచ్చిస్తాను" అన్నాడు.

నిర్లిప్తంగా వెళ్ళిపోయాను. తర్వాత ఆతడెప్పుడూ కని



పించలేదు. మానవత్వం మీద నాకున్న నమ్మకం కొంచెం సడలింది.

నాకు హైదరాబాద్‌కి బదిలీ అయింది. ఒకరోజు స్కూటరు మీద వెళ్తూంటే దారిలో ఒక కుంటి అతను లిఫ్టు కావాలని చెయ్యి ఊపాడు. జాలి పడి ఎక్కించుకున్నాను. "ఎక్కడికెళ్ళాలి?" అని అడిగాను.

అతడు "మీ ఇష్టం సార్. ఎక్కడైనా దింపండి" అన్నాడు.

నాకు చిరాకేసింది. "అసలు నువ్వెక్కడికెళ్ళాలయ్యా?" అన్నాను.

"సార్, నేను నిజామాబాద్ నించి వస్తున్నాను. అక్కడ నేషనల్ సీడ్స్ కార్పొరేషన్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాను. మా నాన్నగారు రేపల్లెలో వుంటారు. ఆయనకి సీరియస్‌గా వుందని ఫోనొస్తే హడావుడిగా బయలుదేరాను. నా ఖర్మ ఎప్పుడూ లేంది, రైల్లో టాయిలెట్‌కి వెడితే నా జేబులో పర్సు జారి పడిపోయింది. అందుకని బతిమాలి ఏ లారీలోనైనా ఎక్కుదామని బయలుదేరాను" అన్నాడు.

స్కూటరు ఒక పక్కకి ఆపాను. అతడు రేపల్లె వెళ్ళడానికి నూటయాభై రూపాయలవుతాయన్నాడు. జేబులోంచి తీసి ఇచ్చాను. అతడు కృతజ్ఞతగా చేతులు జోడించి నా విజిటింగ్ కార్డు తీసుకున్నాడు.

"సార్, వెళ్ళగానే మనియార్డరు చేస్తాను. మా నాన్నగారి చివరిచూపు దక్కాలని ఆశీర్వదించండి సార్" అన్నాడు.

నాకు కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. జేబులోంచి మరో ఇరవై రూపాయలు తీసి అతడు వద్దంటున్నా బలవంతంగా ఇచ్చి, దారిలో ఏమన్నా తినమన్నాను.

అతడు కృతజ్ఞతగా నమస్కరించి "సార్, వెళ్ళగానే తప్పనిసరిగా మనియార్డరు చేస్తాను" అన్నాడు.

ఇది జరిగిపోయి ఏడు నెలలైంది. అతడనించి నాకు మనియార్డరు మాత్రం రాలేదు. ఒకసారి ఆఫీసు పనిమీద నిజామాబాద్ వెళ్ళాను. అప్పుడు అతడి మాటలు గుర్తుకు వచ్చాయి. నేషనల్ సీడ్స్ కార్పొరేషన్‌కి వెళ్ళి అక్కడ కుంటిగా వుండే అటెండరు ఎవరన్నా వున్నారేమో అని వాకబు చేసాను. ఎవరూ లేరని తెలిసింది. నాకు మనుషుల మీద నమ్మకం పూర్తిగా పోయింది. ఇంక ఎవ్వరి మీదా జాలి చూపించకూడదనుకున్నాను.

నాకు మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక టౌన్‌కి బదిలీ అయింది. ఒకరోజు సాయంత్రం షికారుకి వెళ్తుండగా ఒక నడివయస్కుడు ఏడుస్తూ దారికి అడ్డు పడ్డాడు. చిరాగ్గా చూసాను.

"సార్, నేను కూలి పని చేసుకుని బతికేవాడిని. నన్ను పిచ్చి కుక్క కరిచింది. ఇంజక్షన్లకి మూడు వందల డెబ్భై రూపాయలవుతాయన్నారు. నా దగ్గర మూడు వందలున్నాయి. ఒక్క డెబ్భయి రూపాయలివ్వండి. మీరు బేంకులో వుంటారని తెలుసు. పది రోజుల్లో ఇచ్చేస్తాను" అన్నాడు.

నాకు తిక్కరేగింది. ఎంత దారుణమైన ఎక్స్‌ప్లాయిటేషన్! కోపంగా "ధర్మాసుపత్రికి పోరా" అన్నాను.

"సార్. అక్కడ కూడా డబ్బులడుగుతున్నారు సార్" అన్నాడు ఏడుస్తూ.

కోపంగా నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టి అవతలకి పొమ్మన్నాను.

ఇది జరిగిన పదిహేను రోజులకి మున్సిపాల్టీ వాళ్ళు ఒక దిక్కులేని శవాన్ని వేన్‌లోకి ఎక్కిస్తుండటం నా కంట పడింది. అతడు నాకు కనిపించినవాడే! వాళ్ళలో వాళ్ళు అనుకుంటున్న మాటలు నా చెవిన పడ్డాయి.

"పిచ్చి కుక్క కరిచిందట భాయ్. సూది మందు వేయించుకోకుండా గమ్మునుండిపోయాడు. దిక్కులేని సావు సచ్చాడు"

నాకు మనసు చివుక్కుమంది. చిన్నప్పుడు చదువుకున్న వేమన పద్యం గుర్తుకు వచ్చింది. దానం చెయ్యడమే నీ వంతు. అది అపాత్రదానమా, సపాత్రదానమా అని ఆలోచించకూడదు అని ఆ పద్యం భావం.

నేను ఓ కొత్త గుణపాఠం నేర్చుకున్నాను.

-పెయ్యేటి రంగారావు (హైదరాబాద్)